క్లుప్తంగా

చవితి ఉత్సవాల్లో మంత్రి కుటుంబం



మంత్రి స్వగృహంలో వేడుక దృశ్యం

కళ్యాణదుర్గం: వినాయక చవితి ఉత్సవాల్లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉష శ్రీచరణ్ కుటుంబ సభ్యులు సందడి చేశారు. బెంగుళూరులోని మంత్రి స్వగృహంలో సోమవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గణనాథుని ప్రార్థిస్తూ నైవేద్యం సమర్పించి భర్త శ్రీచరణ్‌తో కలసి మంత్రి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

నిబంధనలు పాటించాలి



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారి శంకర్

కళ్యాణదుర్గం: మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి శంకర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు మీ సేవా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీ సేవా కేంద్రాల్లో ఫర్నీచర్, వినియోగదారులకు అందుతున్న సేవలు, బోర్డుల ఏర్పాటు, తీసుకుంటున్న రుసుం, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సేవలు అందించాలని ఆయన సూచించారు. వినియోగదారుల నుంచి అధికంగా డబ్బు వసూలు చేసినట్లు తెలిస్తే మీ సేవా కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు



షాపులో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ

ఉరవకొండ: పట్టణంలోని ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాక్‌ను తనిఖీ చేసి డీలర్లకు పలు సూచనలు చేశారు. రబీ సీజన్ త్వరలో ప్రారంభం అవుతుందని, డీలర్లు ఎరువు కృత్రిమ కొరత సృష్టించొద్దని సూచించారు.

నివాళి



పాడె మోస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: పట్టణానికి చెందిన గార్మెంట్ యజమాని, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవర కొండ ప్రసాద్ సోదరుడు వెంకటేశులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. వినాయక చవితి పండుగను సైతం లెక్క చేయకుండా పాడె మోస్తూ విప్ మానవత్వం చాటుకున్నారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు దగ్గరుండి వారితోపాటే ఇంటికీ చేరుకున్నారు. విప్ అభిమానానికి మృతుడి కుటుంబ సభ్యులు ఫిదా అయిపోగా, ప్రజలంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయం సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారి విప్‌పై అభినందనలు వెల్లువెత్తాయి.

వామ్మో.. కొండ చిలువ!



అక్కమాంబ కొండ వద్ద రోడ్డు దాటుతున్న కొండచిలువ

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని అక్కమాంబ ఆలయ సమీపంలో కళ్యాణదుర్గం– అనంతపురం ప్రధాన రహదారి సమీపంలో మంగళవారం రాత్రి 10.20 గంటల సమయంలో రోడ్డు దాటుతూ కొండ చిలువ కనిపించింది. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది కొండ చిలువ రోడ్డు దాటి ముళ్ల పొదల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

దండాలయ్యా.. బొజ్జ గణపయ్యా



రాయదుర్గం: దశభుజ గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు



ఉరవకొండ: రంగావీధిలో నాట్య వినాయకుడు



కళ్యాణదుర్గం: కోటవీధిలో వెలసిన పార్వతీ తనయుడు

- వాడవాడలా కొలువుదీరిన విగ్రహాలు
- ఘనంగా వినాయక చవితి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: రాయదుర్గం , కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గం వ్యాప్తంగా వాడవాడలా గణేష్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. నిర్వాహకులు మండలపాలను సుందరంగా తీర్చిదిద్ది వైవిధమైన రూపాల్లో గణనాథుడి విగ్రహాలను కొలువుదీర్చారు. వేకువజాము నుంచే గణపతి ఆలయాలు, మండపాలకు భక్తులు పోటెత్తారు. పార్వతీ సుతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన రాయదుర్గంలోని దశభజ గణపతి దర్శనానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, కుమారుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, కోడలు అలేఖ్యరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, శోభరాణి తదితరులు విప్ కుటుంభ సభ్యులను సత్కరించారు. అక్కడే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కాపు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వినాయక సర్కిల్ లో ప్రతిష్ఠించిన ప్రతిమకు పూజలు నిర్వహించారు. అక్కడి నుండి మహాహిందూ గణపతి సేవలో తరించారు. శాంతినగర్ నుంచి ఊరేగింపుగా వచ్చే కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. కేరళ, తమిళనాడు నుంచి వచ్చిన సాంస్కృతిక కళాకారులు పలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. పల్లెల్లోనూ గణపతి ఉత్సవాలు సందడిని తలపించాయి. ఈ సందర్భంగా విప్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలన్నీ తొలగిపోయి .. రాష్ట్రం మరింత విస్తృతంగా ప్రగతి సాధించాలనీ.. ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వినాయక సర్కిల్ వద్ద కాపు మీడియాతో మాట్లాడారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుడి దీవెనలతో అధిగమిస్తూ, సకల జన సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్విఘ్నంగా అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. జగన్ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, అనంతపురం డీఎల్‌ఓ రాజశేఖర్‌శర్మ దంపతులు, జయంతి విష్ణు మిత్రబృందం తో పాటు కౌన్సిలర్లు, ఐదు మండలాల్లోనూ ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల కన్వీనర్లు, పార్టీ అనుభంద సంఘం నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలసి విప్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాయదుర్గంలో మొట్ట మొదటిసారిగా హిందూ మహాగణపతి వేడుకలు దాదాపు 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, రాజేష్ తెలిపారు. అలాగే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బెళుగుప్ప మండల కేంద్రంలోని విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు వినాయకవ్రత పూజలను, పంచలోహ ఉత్సవ విగ్రహంతో ప్రాకారోత్సవం ఘనంగా చేపట్టారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రాయదుర్గం టౌన్ హిందూ మహాగణపతిని దర్శించుకుంటున్న భక్తులు



కణేకల్లు: బస్టాండ్ ప్రాంతంలో కొలువుదీరిన వినాయకుడు



రాయదుర్గం రూరల్: కెంచానపల్లిలో బొజ్జగణపయ్య



బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడు



కళ్యాణదుర్గం: వాసవీ మాత ఆలయంలో కొలువైన ఏనుగు వినాయకుడు



కూడేరు: జల్లిపల్లిలో కేదార్నాథ్ ఆలయ ఆకారంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



బెళుగుప్ప: పంచ లోహ విఘ్నేశ్వర పల్లకీ సేవలో భజన చేస్తున్న భక్తులు



బ్రహ్మసముద్రం: పూజలందుకున్న బొజ్జ గణపయ్య



గుమ్మఘట్ట: కలుగోడులో వినాయకుడు



కంబదూరు: కొత్త ఎస్సీ కాలనీలో గణపయ్య




కుందుర్పి: ఫెర్రర్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహం



ఉరవకొండ: అయ్యప్పస్వామి రూపంలో ఉన్న మట్టి వినాయకుడు



విడపనకల్లు: చీకలగురికిలో వినాయకున్ని ప్రతిష్టించి పూజలు చేసిన భక్తులు



వజ్రకరూరు: బలిజవీధిలోని బందమ్మ కట్ట వద్ద కొలువుతీరిన గణపయ్య



బెళుగుప్ప: అలంకరణలో విఘ్నేశ్వరాలయంలోని మూలవిరాట్



కళ్యాణదుర్గం: వాల్మీకి సర్కిల్‌లో కొలువైన గణనాథుడు

సచివాలయాలే ప్రజలకు దేవాలయాలు



గోనేహాళ్‌లో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: ప్రజలకు చేరువుగా ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ సచివాలయాలు ఈ రోజు పల్లెల్లో ప్రజలకు దేవాలయాలుగా మారాయని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ గ్రామంలో గ్రామ సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను విప్ ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవలు అందాలంటే గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చి ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రత పక్ష టీడీపీ నాయకులు లేనిపోని కుట్రలు చేసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని కాపు పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వ హయంలో కేవలం టీడీపీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంతృప్తస్థాయిలో పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం గోనేహాళ్ ఎస్సీ కాలనీ నుంచి గోనేహాళ్ గ్రామానికి రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మాణానికి విప్ భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన సుమంగళమ్మకు రూ.80 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సర్పంచ్ శ్వేత, వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ వెంకటస్వామి, నాయకులు ఈశ్వరరెడ్డి, వెంకటాక్షిపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వర, జయరాంరెడ్డి, జి.ఎం. నాయుడు, శ్రీరాములు, ప్రకాష్‌రెడ్డి, రామకృష్ణ, విశ్వనాథ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, గాధిలింగ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పక్కాగా చేపట్టండి

కళ్యాణదుర్గం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పక్కాగా చేపట్టాలని పర్యవేక్షణ అధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ కాలనీలో మంగళవారం సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సురక్ష కార్యక్రమంలో అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన రోగులతో సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

ఉరవకొండ: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతాయని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైస్ ఎంపీపీ నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ చైర్మన్లు తేజోనాథ్, గోవిందు అన్నారు. మంగళవారం చౌడేశ్వరీ కాలనీలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకన్న, ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, బసవరాజు, అశోక్‌కుమార్, ఆసీఫ్, చిన్న భీమా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

బ్రహ్మసముద్రం: గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగు నీరు అందిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్ సుజాతమ్మ అన్నారు. మండలంలోని గుండిగానిపల్లిలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామస్తుల దాహార్తి తీర్చడానికి బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా ప్రజలకు తాగు నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ గంగాధర, డీలర్ నాగిరెడ్డి, నాయకులు రామ్మోహన్, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో మంగళవారం వేర్వేరు చోట్ల బైకులు అదుపు తప్పి పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురానికి చెందిన హరిజన బాబు తన ద్విచక్రవాహనంలో మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వస్తుండగా అదుపు తప్పి బోల్తాపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాబును స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అలాగే శెట్టూరు మండల కేంద్రానికి చెందిన మంజు కళ్యాణదుర్గం వైపు వస్తున్నాడు. గరుడాపురం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ప్రమాదంలో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లికి చెందిన రామాంజనేయులు కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా బైకు అదుపు తప్పి బోల్తాపడ్డాడు. 108లో అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా మారెమ్మ జాతర



వద్రహొన్నూరులో మారెమ్మ ఆలయం వద్ద భక్తులు

రాయదుర్గం రూరల్/టౌన్/గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం/శెట్టూరు: రాయదుర్గం మండలంలోని వద్రహొన్నూరు, గ్రామదట్ల, కదరంపల్లి, కొండాపురం, ఆవులదట్ల, జుంజురాంపల్లి, ఆర్బీవంక, కొంతానపల్లి, మెచ్చిరి, మల్లాపురం, చదం, 74 ఉడేగోళం, బీఎన్ హళ్లి తదితర గ్రామాల్లో మంగళవారం మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. కొంతమంది భక్తులు ఇనుప చువ్వలతో నోటిబీగాలు వేసుకుని మొక్కులు తీర్చుకోగా, మరికొందరు వేప మండలు ధరించి, గండాదీపాలతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని నేసేపేటలో దండుమారెమ్మ ఆలయం, బళ్లారి రోడ్డు నందు వెలసిన పెద్ద మారెమ్మ ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి దంపతులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మల్కన్న, ఓబ నాగరాజు, శీన, సిద్దలింగ తదితరులు కాపు దంపతులను సత్కరించారు. అలాగే గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లోని పలు గ్రామాల్లో మారెమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శెట్టూరు మండలం బసంపల్లిలో గ్రామ దేవత మారెమ్మ జాతర చేపట్టారు.

అక్క దేవతలకు పూజలు

కూడేరు: వర్షం కోసం మండలంలోని అరవకూరులో గ్రామస్తులు, గొర్రెలు కాపరులు సోమవారం గ్రామదేవతయిన అక్క దేవతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అరవకూరు, ఇప్పేరు, పి.నాగిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న అక్కదేవతల ఆలయానికి మంగళవాయిద్యాల చెరుకు, పూజా సామాగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి గంపలో తెచ్చిన ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టి పూజలు చేపట్టారు.

ధుగ్గిలమ్మ జాతర



ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో దుగ్గిలమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం, మొక్కులు తీర్చుకునేందుకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేపాకు చుట్టుకొని మహిళలు, పెద్దలు, పిల్లలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, చెక్కర, ఆకు పూజలు, కొబ్బరి సమర్పించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న కోట మారెమ్మ ఆలయం వద్ద సిడి మాను ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే పట్టణంలోని నేసేపేటలోని పెద్ద మారెమ్మ, దండుమారెమ్మ ఆలయాల వద్ద కూడా సిడి మాను ఉత్సవం చేపడతారు.

సంక్షిప్త సమాచారం

నేడు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభం

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని నాగలాపురంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ 1, 2, కేంద్రాలు, అలాగే తిమ్మలాపురంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం .వన్నూర్‌స్వామి మంగళవారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నేడు భూమి పూజ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 29వ వార్డు వైఎస్సార్ విగ్రహం ఎదురుగా సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఉదయం 9 గంటలకు భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరవుతారన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గం: మాదిగల సమస్యలపై ఈనెల 25వ తేదీన చలో సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైగర్ వన్నూరుస్వామి, పార్లమెంట్ అధ్యక్షుడు దురదకుంట వన్నూరుస్వామి, రమణమూర్తి మాట్లాడుతూ పుట్టపర్తి జిల్లాలో మాదిగలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ముట్టడి చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, తిప్పన్న, వెంకటేశులు, ఎల్లప్ప, నారాయణ, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి జయంతి

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో భద్రకాళి సమేత వీరభద్రస్వామి జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారితోపాటు స్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు రాఘవేంద్రస్వామి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అమ్మవారి ఉత్సవ విగ్రహ ముఖ మండపం ఆవిష్కరణ, శిఖర కలశ ప్రతిష్ట పూజలు హోమాలు చేపట్టారు. రాత్రికి భజన కార్యక్రమాలను నిర్వహించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన ట్రాక్టర్

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం గొర్రెల మందపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. పోలీసుల వివరాల మేరకు.. కాలువపల్లికి చెందిన కాపరులు షెక్షావలి , దాదు, ఆనంద్ గొర్రెలను మేతకు తీసుకెళ్లి ఇంటికి తిరుగుముఖం పట్టారు. గ్రామ సమీపంలో చింతవనం సమీపంలో ఓ ట్రాక్టర్ గొర్రెలపై దూసుకెళ్లింది. రహదారి మొత్తం రక్తసిక్తంగా మారి 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 30 జీవాలకు గాయాలయ్యాయి. హుటాహుటిన సమీపంలోని గంగవరం పశు వైద్యాధికారి నాగబాబు వెటర్నరీ సిబ్బందితో కలసి వెళ్లి గాయాలైన గొర్రెలకు చికిత్సలు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు.